

లాభాల కిక్ రివర్స్

మద్యం వ్యాపారం జోలికి వెళ్లిన వారి ఆశలు గల్లంతయ్యాయి. చేసిన అప్పులే ఇప్పుడు మిగులుతున్నాయి. లైసెన్స్‌దారులకు 20 శాతం కమీషన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తీరా అమ్మకాలు నిర్వహించిన తర్వాత తత్వం బోధపడింది. కమీషన్ ఇప్పుడు 9.5 శాతమే వస్తోంది. షాపులు దక్కించుకున్న వారికి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.

- నష్టాల బాటలో మద్యం షాపుల లైసెన్స్‌దారులు
- 20 శాతం కమీషన్ ఆశిస్తే.. వస్తున్నది 9.5 శాతమే..
- డిపో అమ్మకాలపై ఇవ్వాలంటున్న లైసెన్స్‌దారులు
- ఆశలు తల్లకిందులు.. అప్పులు చేసి లైసెన్స్ ఫీజు చెల్లింపు
- ఇలాగైతే ఏడాదికి కోటి వరకు నష్టం

నేడు విజయవాడలో వ్యాపారుల సమావేశం

లైసెన్స్‌దారులంతా విజయవాడలో సోమవారం సమావేశం కావాలని నిర్ణయించారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. న్యాయపోరాటం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి సలహాలు తీసుకునే ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం న్యాయపోరాటంలోనూ లైసెన్స్‌దారులకు చుక్కెదురు కానుందని అధికారులు తేల్చేశారు. ప్రభుత్వం ఇష్యూ ధర మీద 20 శాతం కమీషన్ ఇస్తామని జీవోలో స్పష్టం చేసింది. అంటే డిస్టలరీల నుంచి డిపోలకు ఇచ్చే ధరపై 20 శాతం అంటూ అధికారులు తేల్చేశారు. తక్కువ ధరకే డిపోలకు మద్యం సరఫరా అవుతుంది. దానివల్ల 20శాతం కమీషన్ ఇస్తున్నా సరే లైసెన్స్‌దారులకు 9.5శాతం మాత్రమే లభిస్తోంది. అదే గతంలో డిపోల నుంచి ఇచ్చే ఇన్‌వాయిస్ ధరలో కమీషన్ ఉండేది. అంటే రూ.99ల మద్యానికి 20 శాతం కమీషన్ అన్నమాట. ఈ లెక్కన క్వార్టర్ బాటిల్ రూ. 80లకు లైసెన్స్‌దారులకు రావాలి. కానీ రూ.90 పడుతోంది. దీనివల్ల లైసెన్స్‌దారులు న్యాయపోరాటం చేయడానికి అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు మద్యం విధానాన్ని అమలుచేసింది. అంతే పార్టీల నాయకులు, వ్యాపారులు, మద్యం షాపుల కోసం ఎగబడ్డారు. లక్షల రూపాయలు సమర్పించుకుని షాపులు దక్కించుకున్నారు. లైసెన్స్ ఫీజులు చెల్లించడానికి ప్రతి ఒక్కరూ అప్పులుచేశారు. ఒక్కో షాపునకు ఏకంగా రూ.50 లక్షలు వెచ్చించాల్సి వచ్చింది. లైసెన్స్‌లు పొందిన వారు కొందరు ముందుగానే విక్రయించేవారు. ఆ షాపులను ఇతర లైసెన్స్‌దారులు ఎగబడి కొనుగోలు చేశారు. తీరా కమీషన్ తగ్గిపోవడంతో లైసెన్స్‌దారులు గగ్గోలు పెడుతున్నారు.

రోజుకు రూ.4.50 కోట్లకు పెరిగిన అమ్మకాలు

ప్రైవేటు మద్యం విధానంలో అమ్మకాలు పెరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం దిగుమతులు నిలిచిపోయాయి. నాణ్యమైన మద్యం క్వార్టర్ రూ.99లకే విక్రయిస్తున్నారు. దాంతో మద్యం ప్రియులు ఒకటికి రెండు బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదికంటే ఈ సారి జిల్లాలో 20 శాతం అమ్మకాలు పెరిగాయి. వ్యాపారులు అధికంగా ఉంటే లైసెన్స్‌దారులకు ఊరట లభిస్తుంది. కమీషన్ రూపంలో లాభం ఉంటుంది. కానీ, ప్రభుత్వం అనుకున్న రీతిలో కమీషన్ ఇవ్వడం లేదు. కేవలం 9.5 శాతం మాత్రమే వస్తోంది. గతంలో జిల్లావ్యాప్తంగా రోజుకు రూ.3.80 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయేది. ఇప్పుడు రూ.4.50 కోట్ల మేర అమ్మకాలు సాగుతున్నాయి. అందులో 9.5 శాతం కమీషన్ రూపంలో లైసెన్స్‌దా రులకు లభిస్తోంది. జిల్లాలో 175 షాపులున్నాయి. కొన్నిచోట్ల షాపుల అద్దె నెలకు రూ. లక్ష చెల్లిస్తున్నారు. నిర్వహణ వ్యయం తడిసి మోపెడైంది. దీంతో లైసెన్స్‌దారులు తలలు పట్టుకుంటున్నారు.

బెల్టుకు నో..

బెల్టు షాపులు పెట్టుకోవడానికైనా అవకాశం ఉంటుందని




ఆశించారు. సిండికేట్ అయితే బాటిల్‌పై కాస్త ఎక్కువ సొమ్ము చేసుకోవచ్చని భావించారు. వీటన్నింటిపైనా ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. అధిక ధరలకు విక్రయాలు సాగిస్తే అధికారుల నుంచి, నేతల వరకు ముడుపులు చెల్లించాలి. దొంగ వ్యాపారం అన్న ముద్ర పడుతుంది. ప్రభుత్వం హామీ ఇచ్చిన 20 శాతం కమీషన్ ఇవ్వాలన్న ఉద్దేశంతో లైసెన్స్‌దారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అలా కాకుంటే రెండేళ్లలో ప్రతి షాపుకు కోటి రూపాయల మేర నష్టాలను చవిచూడాల్సి వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు.

పెదవి విప్పని నేతలు

కొన్నిచోట్ల 25 నుంచి 30 శాతం వరకు భాగస్వామ్యాన్ని ప్రజాప్రతినిదులు తీసుకున్నారు. వచ్చే కమీషన్‌లో వారికి కొంత చేరిపోతోంది. అయితే లైసెన్స్ దక్కించుకో వడానికి వెచ్చించిన రూ.50 లక్షలతో ప్రజా ప్రతినిధులకు సంబంధం లేదు. షాపులు దక్కించుకున్న తర్వాత మాత్రమే అందులో వంతు కావాలంటూ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. దీనికి లైసెన్స్‌దారులు అంగీకరించాల్సి వచ్చింది. తీరా ఇప్పుడు కమీషన్ రూపంలో చేదు అనుభవం ఎదురైంది. దీనిపై వాటాలు దక్కించుకున్న ప్రజా ప్రతినిధులు పెదవి విప్పడం లేదంటూ వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుత విధానంలో ప్రభుత్వానికి ఆదాయం బాగుంది. వ్యాపారులకు నష్టం చేకూరుతోంది.

బార్‌ల ఆశలు తల్లకిందులు

వైసీపీ హయాంలో బార్‌ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొందింది. ప్రభుత్వ షాపుల్లో నాసిరకం (మిగతా 8వ పేజీలో)





బీచ్‌లో సందడి

మొగల్తూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం నాలుగో ఆదివారం కెపి పాలెం, పేరుపాలెం బీచ్‌లు సందర్శకులతో కిటకిటలాడాయి. అధికారుల అంచనా ప్రకారం 25 వేల మంది వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. వీరంతా సముద్రపు అలల మధ్య గడిపారు. డీఎస్పీ వేద ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో నలుగురు ఎస్ఐలు 90 మంది పోలీస్ సిబ్బంది బందోబస్త్ నిర్వహించారు. 20 మంది గజ ఈత గాళ్లను నియమించారు. సముద్రంలో ఏర్పాట్లు చేసిన బారికేడ్‌లు దాటి వెళ్ళకుండా కట్టడి చేశారు.



పండ్ల అలంకరణలో పంచారామ క్షేత్రమైన భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామి

గాలి పీల్చారో..!

దుమ్ము, ధూళితో పొంచి వున్న ముప్పు



ఏలూరు నగరం దుమ్ము, ధూళి కణాలతో నిండిపోయింది. సాధారణ స్థాయిని దాటి ప్రమాదకర పరిస్థితుల్లో కొన్నేళ్ళుగా కొనసాగుతోంది. ఫలితంగా వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్నే చూపుతోంది. ముఖ్యంగా రోడ్ల వెంబడి వెలువడే ధూళి కణాలు వాయు కాలుష్యాన్ని మరింత పెంచగా, వాహనాల నుంచి వెలువడే పొగ ఎయిర్ పొల్యూషన్‌ను మరికొన్ని రెట్లు పెరగడానికి కారణమవుతున్నట్టు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) పరిశీలనలో తేలింది. దేశవ్యాప్తంగా అత్యధిక వాయు కాలుష్యం ఉన్న 118 పెద్ద, మధ్య తరహా నగరాలు, పట్టణాల జాబితాలో ఏలూరు కార్పొరేషన్‌ను ఒకటిగా పీసీబీ చేర్చడం గమనార్హం.

వాయు కాలుష్య నగరాల జాబితాలో ఏలూరు నగరం

ఛిద్రమైన రహదారులు, కాలం చెల్లిన వాహనాల పొగతో కాలుష్యం

గాలి నాణ్యతపై పీసీబీ విశ్లేషణ

ఏలూరు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో భారీ పరిశ్రమలు, గనులు లేకపోయినా వాయుకాలుష్యం తీవ్రత అధికంగా ఉందని పీసీబీ కొన్నేళ్ళ క్రితమే గుర్తించింది. నేషనల్ ఎయిర్ మానటరింగ్ ప్రోగ్రాం(నాంప్) కింద రాష్ట్రంలో ఎంపిక చేసిన నగరాలు, పట్టణాల్లో గాలి నాణ్యతను పరిశీలించడానికి ఆయా ప్రాంతాల్లో యంత్రాలను అమర్చారు. వీటి నుంచి సేకరించిన విశ్లేషణల్లో ఏలూరు పరిధి అంతటా గాలి నాణ్యత ప్రమాదకరస్థాయిలో ఉందని నిర్ధారించారు. ఒక మీటర్ క్యూబ్‌లో ధూళికణాలు 60 మైక్రోగ్రాములకంటే ఎక్కువ పరిణామంలో ఉంటే ఆ ప్రాంతంలో వాయు కాలుష్యం ఉన్నట్టుగా ప్రకటిస్తారు. ఏడాది కాలంలో ఈ విశ్లేషణలన్నింటినీ క్రోడీకరించి వాయుకాలుష్యం ఉన్నదీ, లేనిదీ నిర్ణయిస్తారు. ఆ ప్రకారం ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఒక దశలో గాలి నాణ్యత గరిష్ట మోతాదు అంటే 69 మైక్రో గ్రాములకు చేరిందని పీసీబీ ప్రకటించి వాయు కాలుష్య నగరాలు, పట్టణాల జాబితాలో చేర్చింది. కొంత కాలం క్రితం నగరంలోని జూట్‌మిల్లు మూసివేసిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోవున్న గాలి నాణ్యతను కొలిచే యంత్రాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం వాయుకాలుష్యం కొంత మేర అంటే 64 మైక్రో గ్రాములకు తగ్గిందని ఇటీవల నిర్ధారణకు వచ్చారు. అయినప్పటికీ పలు రహదారులు ఛిద్రమై వాహనాలు వెళుతున్నపుడు ధూళికణాలు భారీ మొత్తంలో పైకి లేచి వాయు కాలుష్యం మోతాదులను పెంచుతున్నాయని తేల్చారు. రోడ్ల దుస్థితి నగరంలో ఆశ్రం



హాస్పిటల్ రోడ్డు నుంచి పాత బస్టాండ్ వరకు, కైకలూరు రోడ్డు, మరి కొన్ని అంతర్గత రహదారుల్లో ధూళికణాలు విపరీతంగా ఎగిసి పడుతున్నట్టు గుర్తించారు. మరోవైపు కాలం చెల్లిన వాణిజ్య వాహనాలు, ప్రైవేటు వాహనాల నుంచి వెలువడే పొగ కూడా వాయుకాలుష్య మోతాదులను కొన్ని రెట్లు పెంచడానికి కారణమవుతోంది.

త్వరలో గాలి నాణ్యత మిషన్

ప్రజలు గాలినాణ్యతను ప్రత్యక్షంగా తెలుసుకునేలా కంటిన్యూస్ యాంబియట్ ఎయిర్ క్వాలిటీ స్టేషన్‌ను ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి పీసీబీ చర్యలు చేపట్టింది. ఈ మిషన్ ద్వారా ధూళికణాలను విశ్లేషించి ప్రతి పది నిమిషాలకోసారి గాలి నాణ్యతను బహిరంగంగా ఏర్పాటుచేసే స్క్రీన్‌పై అందరూ వీక్షించడానికి వీలుగా ప్రదర్శించే ఏర్పాటు ఇందులో ఉంటుంది.

నియంత్రణపై దృష్టి



ఏలూరు నగరాన్ని వాయు కాలుష్యరహితంగా తీర్చిద్దడానికి చర్యలు అవసరం. రోడ్లపై గుంతలను పూడ్చే పనులు పూర్తయితే ధూళి కణాల మోతాదు తగ్గుతుంది. రోడ్లను నీళ్ళతో తడుపుతుండాలి. మొక్కలను విరివిగా నాటాలి. వాహనాల నుంచి మోతాదుకు మించి పొగ వెలువడకుండా పర్యవేక్షించాలి. మృతదేహాల దహనానికి గ్యాస్ ఆధారిత శ్మశాన వాటిక వినియోగించాలి. నిర్దేశిత ప్రమాణాలకు మించి వాయు కాలుష్యం ఏలూరులో ఎక్కువగా ఉన్నప్పటికీ తగిన చర్యలతో ప్రజారోగ్యానికి ముప్పేదీలేదు.

- కె.వెంకటేశ్వరరావు, ఇంజనీరు, పీసీబీ, ఉమ్మడి పశ్చిమ గోదావరి

ఫీజుల చెల్లింపుల్లో విద్యార్థులపై ఒత్తిడి చేస్తే.. కఠిన చర్యలు

- కలెక్టర్ నాగరాణి

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికి హాల్ టికెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిలువరించకూడదు. కాదని, నిరోధిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' అని డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల యాజమాన్యాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఫీజు చెల్లించని కారణంగా కొందరు డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, పరీక్షలను రాయనీయకపోవడం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఫీజును కళాశాలల అకౌంట్లలోకి జమ చేస్తూ జీవో ఇచ్చిందని చెప్పారు.

వచ్చే నెల 2 నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

భీమవరం టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చే నెల రెండో తేదీ నుంచి దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించనుంది. జనవరి నుంచి వీటిని అందజేస్తామని ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రకటించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులకు ప్రతీ నెల 25 వరకు దరఖాస్తులు తీసుకుని అర్హులకు 15 రోజుల్లో అందించేవారు. వైసీపీ హయాంలో కొత్త కార్డుకు దరఖాస్తులు చేసుకుంటే మూడు నెలలకు ఒకసారి ఇచ్చేవారు. ఇప్పుడు మళ్లీ కార్డులకు దరఖాస్తులు ఆహ్వానించారు.

ఐక్యతతోనే అభివృద్ధి



ఎస్సీలు ఐక్యంగా సాగితేనే అభివృద్ధి పథంలో ఉంటారు. లేకపోతే తిరిగి అంధకారంలోకి వెళ్ళాల్సి వస్తుంది' అని నూజివీడులో జరిగిన మాలల ఆత్మ గౌరవ సభలో బాబా సాహెబ్ అంబేడ్కర్ మునిమనుమడు రాజారత్నం అంబేడ్కర్ హెచ్చరించారు. మెయిన్‌లో..

కాల్వలోకి బస్సు బోల్తా



తాడేపల్లిగూడెం నుంచి 25 మంది ప్రయాణికులతో భీమవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ వదిలేయడంతో ముదునూరు సమీపంలో ఆదివారం సాయంత్రం పంట కాల్వలో బోల్తాపడింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. మెయిన్‌లో..

హింస.. ఇక చాలు



మహిళలపై ఏదో ఒక దశలో హింస కొనసాగుతూనే ఉంది. ఇంటిలోనూ, సమాజంలోనూ ఆమెకు రక్షణ కరువవుతోంది. ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా, ఎంత రక్షణ కల్పించినా సమాజంలో మార్పు రావడం లేదు. నేడు మహిళలపై హింస నిర్మూలన దినం.. 7లో

భావి పౌరులకు రాజ్యాంగాన్ని పరిచయం చేస్తున్నాం

- రేపు రాజ్యాంగ దినోత్సవం.. విద్యార్థులకు పీఠిక పఠనం.. ప్రతిజ్ఞ నిర్వహిస్తున్నాం..
- రాజ్యాంగ ప్రచార వేదిక కో ఆర్డినేటర్ డీవీవీఎస్ వర్మ

ఇంటర్వ్యూ..

తణుకు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం. జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే అని మనకందరికి తెలుసు. ఈ రెండు దినోత్సవాలను ఎంతో ఘనంగా జరుపుకుంటాం. మొదటిది బ్రిటీష్ వారు దేశాన్ని వదిలి పెట్టిన రోజైతే.. రెండోది బ్రిటీష్ వారు రూపొందించిన భారత ప్రభుత్వ చట్టానికి బదులు.. మనకు మనమే తయారు చేసుకున్న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు. నవంబరు 26వ తేదీ మరో విశేషం వుంది. అదే రాజ్యాంగ రచన పూర్తయిన రోజు. దీనినే రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటాం. భావితరాలకు రాజ్యాంగ స్ఫూర్తిని పరిచయం చేయాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉందని భావించి నడుం బిగించారు.. తణుకుకు చెందిన సామాజిక వేత్త డీవీవీఎస్ వర్మ. రాజ్యాంగ ప్రచార వేదికను ఏర్పాటు చేసి, కో ఆర్డినేటర్‌గా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన మాటల్లోనే..

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

1946 డిసెంబరు 9న మొదలైన రాజ్యాంగ రచన రెండు సంవత్సరాల 11 నెలల 17 రోజులపాటు కొనసాగి అనేక సమావేశాలు, సవరణలు అనంతరం 1947 నవంబరు 26న ఆమోదం పొందింది. 1950 జనవరి 26న అమలుల్లోకి వచ్చింది. ఈ రాజ్యాంగానికి లోబడే పరిపాలన సాగాలి. రాజ్యాంగం ఎంచుకున్న ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులుగా ప్రజాప్రతినిధులు, పాలక యంత్రాంగం వారికి సేవకులుగా ఉండాలి. కాని, ఆచరణ దీనికి భిన్నంగా ఉంది. పాలకులే యజమానులుగా పెత్తనం సాగిస్తున్నారు. ప్రజల సొమ్ముతో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తిరిగి ప్రజలకు స్వతంత్ర జీవనానికి, సంక్షేమానికి, అభివృద్ధికి వినియోగించే పవిత్ర కర్తవ్యంగా రాజకీయం తీరు లేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. మరో అంశం ప్రభుత్వాలు ప్రజలకు శ్రేయోరాజ్యాన్ని అందించడానికి రాజ్యాంగం ఆదేశిక సూత్రాలను ప్రకటించింది. ప్రభుత్వాలు కొన్నింటిని చట్టబద్ధంగా చేసినా చాలా వాటికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. దీనిని ప్రజలంతా గుర్తించాలంటే రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవాలి.




రాజ్యాంగ ప్రచార వేదిక

విద్యార్థులు భావి పౌరులు. నవతరం ఓటర్లు. కుల, మత, విద్వేషాలకు లోను కాకుండా రాజ్యాంగ లక్ష్యాల సాధనకు రాబోయే కాలంలో పాలనా యంత్రాంగంలో, ఇతర కీలక ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తారు. వీరు అవినీతికి, ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోను కాకుండా రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలి. ఇది దేశానికి అవసరం. అందుకే వారిలో రాజ్యాంగ స్ఫూర్తిని కలిగించేందుకు తణుకులో అక్టోబరు 30న రాజ్యాంగ ప్రచార వేదిక ఏర్పాటు చేశాం. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల సహకారంతో విద్యార్థులకు రాజ్యాంగ పీఠిక పఠనం-ప్రతిజ్ఞ కార్యక్రమం నవంబరు 26న నిర్వహించాలని నిర్ణయించాం. ఇందుకు కోఆర్డినేటర్‌గా నేను, సభ్యులు విశ్రాంత ప్రిన్సిపాల్స్ డా.గుబ్బల తమ్మయ్య, యస్.మనోరమ, ఎన్ఎస్ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆకుల వెంకటేశ్వరరావు, వివిధ పౌరసంఘాల ప్రతినిధులు డా.రమేష్‌చంద్రబాబు, మురళీకుమార్, దక్షిణామూర్తి, బుచ్చిబాబుతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాం.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఈ బృందం ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని చేసిన విజ్ఞప్తికి తణుకు పట్టణంలోని 25 విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ ప్రధానోపాధ్యాయులు సానుకూలంగా స్పందించారు. విద్యార్థులకు సులభ పద్ధతిలో రాజ్యాంగాన్ని తరగతి గదుల్లో వివరించడానికి నవంబరు 3న యూసీఐఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో ఉపాధ్యాయులకు వర్క్‌షాపు నిర్వహించాం. వివిధ విద్యాసంస్థల నుంచి 40 మంది పాల్గొన్నారు. వీరందరికి రాజ్యాంగ పీఠిక పద పరిచయం, ప్రాథమిక హక్కులు- విధులు, ఆదేశిక సూత్రాలకు సంబంధించిన సమాచార పత్రాలను, విద్యాసంస్థలు నిర్వహించాల్సిన కార్యక్రమాలు, చేయించాల్సిన ప్రతిజ్ఞ కాపీలను అందించాం. సామాన్య ప్రజలకు, వివిధ తరగతులకు, శ్రమ జీవులకు రాజ్యాంగాన్ని పరిచయం చెయ్యడానికి మరో ప్రచార బృందాన్ని కార్మిక సంఘాల నాయకులు కోనాల భీమారావు, పీవీ ప్రతాప్, పౌరసంఘాల నాయకులు డా.రమేష్ చంద్రబాబు, మురళీకుమార్‌తోపాటు పలు సంఘాల ప్రతినిధులు ఉన్నారు. ఈ ప్రజా సంఘాలు వారి సమావేశాల్లో పీఠికను పరిచయం చేస్తాయి. రాజ్యాంగం ప్రజలది. దానికి వారే యజమానులు, హక్కు దారులు. ఈ చైతన్యం కలిగితే పాలన తీరు ప్రజలకు అనుకూలంగా మారుతుంది. నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజా సంఘాలు సంయుక్తంగా హక్కుదారుల ఉత్సవంగా సభను నిర్వహించుకోవాలి. తణుకు పట్టణంలోని స్కూళ్ళు, కాలేజీల్లో విద్యార్థులతో పీఠిక పఠనం-పీఠిక ప్రతిజ్ఞ చేయిస్తున్నాం.





వైభవంగా మావుళ్ళమ్మ అమ్మవారి పడిపూజ

భీమవరం టౌన్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మావుళ్ళమ్మ మాలధారులచే ఆదివారం రాత్రి ఆలయం వద్ద ఉన్న అమ్మవారి పడి పూజ వైభవంగా చేశారు. ప్రత్యేకంగా అలంక రించిన వేదికపై అమ్మవారి గరగలు, ఉత్స మూర్తిని ఉంచారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో అభి షేకాలు, అమ్మవారికి సహస్రనామాలతో కుంకుమార్చన చేసి అఖండ హారతి అందించా రు. అమ్మవారి శరణుఘోషతో పరిసరప్రాంతా లు మారుమోగాయి. ఎమ్మెల్యే పులపర్తి రామా ంజనేయులు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్య క్షుడు కొటికలపూడి గోవిందరావు పాల్గొన్నారు.

జేఎన్వీలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తు గడువు పెంపు

పెదవేగి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి సంబంధించి దరఖాస్తులు సమర్పించడానికి గడువు తేదీని పొడిగించినట్టు జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తర గతుల్లో ఖాళీల భర్తీకి నవోదయ విద్యాలయ సమితి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని చెప్పారు. ప్రవేశపరీక్షకు దరఖాస్తుకు ఈనెల 26వ తేదీవరకు నవోదయ విద్యాలయ సమితి గడువు పొడిగించిందని ఆమె చెప్పారు. అలాగే దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకోవడానికి ఈనెల 27, 28 తేదీలవరకు అవకాశం కల్పిం చారన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచి ంచారు. అభ్యర్థులు 9వ తరగతిలో ప్రవే శానికి https://cbseitms.nic.in/2024/nvsix, 11వ తరగతిలో ప్రవేశానికి https:// cbse itms.nic.in /2024 /nvsxi వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా దరఖా స్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వివరించారు.

ఇక.. చాలు

అనాదికాలం నుంచి ఆమె అణగదొక్క బడుతోంది.. ఇంటా బయట ఆమె వేధింపులకు గురవుతూనే ఉంది.. అమ్మగా, భార్యగా, కుమార్తెగా, బంధువుగా ఆమె ఎన్నో సేవలు అందిస్తూనే ఉంది.. సమాజంలో పూర్వకాలం నుంచి ఆమెపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేధింపులు కొనసాగు తున్నాయి. ఆమెను చిన్న చూపు చూస్తూనే ఉన్నారు. ఆమెకు రక్షణగా ఎన్ని చట్టాలు ఉన్నా దాడులు మాత్రం ఆగడం లేదు.. కష్టాలను భరిస్తూ కన్నీళ్లను దాచేసుకుంటూ ఇంకా సర్దుకుపోతూనే ఉంది.. ఇక ఈ హింస ఆగాలంటే ఆమె చైతన్యం చెందాలి.. పోరాడాలి..నేడు మహిళలపై హింస నిర్మూలన దినం సందర్భంగా ప్రత్యేక కథనం





మహిళలపై పెరుగుతున్న దాడులు
చట్టాలున్నా ఆగని హింస
మహిళలు చైతన్యం పొందాలి
చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
నేడు మహిళలపై హింస నిర్మూలన దినం

భీమవరం క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :ఆడపిల్ల అర్ధరాత్రి నడి రోడ్డుపై ఒంటరిగా నడి చినప్పుడే నిజమైన స్వతంత్ర్యం అని ఆనాడు మహాత్మా గాంధీ చెప్పిన మాటలు ఇప్పటికీ నేర వేరడం లేదు. నిత్యం ఏదోక చోట మహిలలపై దాడులు, అఘాయిత్యాలు, అరాచకాలు జరుగు తూనే ఉన్నాయి. ఆడవారు పగలు కూడా రోడ్లపై తిరగాలంటేనే భయపడే పరస్థితి నెల కొంది. అలానే ఇంటి వద్ద ఉన్న కూడా బంధు వులు, తెలిసిన వాళ్ళ రూపంలో ఏదొక దారుణం జరుగుతున్నాయి. అసలు మహిళలకు స్వేచ్ఛ అనేది దొరుకుతుందా.. వారిపై అఘాయిత్యా లుకు అడ్డుకట్ట పడుతుందా అనేది ప్రశ్నార్థకం గానే ఎన్నో ఏళ్ళుగా మిగిలిపోయింది.

దాడులకు అడ్డుకట్ట వేసేదెలా..?

ఇటీవల కాలంలో ఏదొక చోట ఏదొక ప్రాం తంలో మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. కామంతో కళ్ళు మూసుకుపోయి కొందరు అయితే ప్రేమ పేరుతో మరికొందరు వంచిస్తున్నారు. నెలల చిన్నారుల వద్ద నుంచి 60 ఏళ్ళ వృద్ధ మహిళల వరకు కామంతో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ప్రభు త్వాలు ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా దాడులు మాత్రం తగ్గడం లేదు. మహిళలపై ప్రేమ అనే సాకు చూపించి వారు ఒప్పుకోకపోతే వారిపై అనేక రకాలుగా దాడులకు పాల్పడుతున్నారు. యాసిడ్ దాడులు, కత్తితో దాడులు ఇలా అనేక రకాలుగా హింసకు పాల్పడుతున్నారు. వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపినా కూడా బెయిల్‌పై బయటకు వచ్చి అలాంటి దాడులు మళ్ళీ మళ్ళీ చెయ్యడం గమనార్హం. మహిళలు, బాలికలు, విద్యార్థులుపై దాడులు అరికట్టాలంటే ఇంకా కఠినమైన శిక్షలు రావాలని మహిళా సంఘాల నాయకులు కోరు తున్నారు. మహిళలు స్వేచ్ఛగా రోడ్డుపై తిరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అంటున్నారు. దాడులకు పాల్పడే వ్యక్తులపై కఠినమైన కేసులు నమోదు చేసి ఉరి శిక్షలు, యావజ్జీవ కారాగార శిక్షలు పడేలా చేస్తే ఇటువంటి అఘాయిత్యాలు, దాడులను అరికట్టవచ్చని చెబుతున్నారు. ఇటీవల కాలంలో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు ఇవీ..

- భీమవరం మండలంలో ఒక వృద్ధురాలిపై ఒక యువకుడు ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించి అఘాయిత్యానికి పాల్పడ్డానికి ప్రయత్నించగా ఆమె పోలీసు లకు ఫిర్యాదు చేశారు.
- భీమవరం ఒకటవ పట్టణంలో కొంత కాలం క్రితం సొంత బాబాయి (పినతండ్రి) బాలి కపై ఎవ్వరూ లేని సమయంలో అఘా యిత్యానికి పాల్పడగా ఆ బాలిక తల్లితండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- భీమవరం ఒకటవ పట్టణంలో ఒక బాలికను బాబాయి (పిన తండ్రి) వసబర్చుకుని గర్భవతిని చేసి తీరా విషయం తెలిశాక ఆ బాలికను హత్య చేసి పంట పొలాల్లో పడివేశాడు. కనిపిం చడం లేదని తల్లితండ్రులు ఆరా తీస్తే అసలు విషయం బయటపడింది. పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.
- జిల్లాలోని ఒక పట్టణంలో 8 నెలలు చిన్నా రిపై వరకు తాత అయిన వృద్ధుడు ఎవరూ లేని సమయంలో అఘాయిత్యానికి పాల్పడ టంతో ఆ బాలిక తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా ఆ వృద్ధుడిని అరెస్టు చేశారు. ఇలాంటి సంఘటనలు పశ్చిమ గోదావరి జిల్లాలో ఏడాదికి 300 నుంచి 400 వరకు జరుగుతూ ఉన్నాయి.



ఏడాదికి 200 కేసులు

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పూర్వకాలం నుంచి మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ఎంతో మంది సంఘ సంస్కర్తలు కృషి చేసి ఎన్నో చట్టాలు తీసుకువచ్చే విధంగా పోరాటాలు చేశారు. ఆడబిడ్డ కడుపులో ఉన్న నాటి నుంచి వృద్ధురాలి వరకూ ఎన్నో రక్షణ చట్టాలు ఉన్నాయి. కానీ వాటిని తెలుసుకోలేక వాటిని ఎలా వినియో గించుకోవాలో తెలియక మహిళలు వేధింపులకు గురవుతున్నారు. కొంత మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. భర్త అత్తింటివారు పెట్టే హింసలకు ఎంతో మంది బలి అయిపోతూనే ఉన్నారు. ఏలూరు జిల్లాలో పరిశీలిస్తే ఏడాదికి 200 వరకట్న వేధింపు కేసులు నమోదు అవుతున్నాయి. మహిళలపై ఇతరులు వేధింపు కేసులు మరో 25 నమోదవు తున్నాయి. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏడాదికి వంద కేసులు నమోదు అవు తున్నాయి. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కూడా మహిళలపై హింస కేసులు కౌన్సెలింగ్‌తో రాజీ చేస్తున్నారు. చట్టం తెలిసిన వారు సైతం మహిళలపై దాడులకు పాల్ప దుతూనే ఉన్నారు. సాటి మహిళలే అత్త రూపంలో కోడళ్ళను హింసిస్తూ ఉన్నారు. ఇలాంటి కేసులు జిల్లాలో నమోదు అవుతూనే ఉన్నాయి.

90 శాతం కౌన్సెలింగ్‌తోనే చక్కబెడుతున్నాం



ఇటీవలి కాలంలో ఓర్పు, సహనం, అందరిలో తగ్గి పోతున్నాయి. యాంత్రిక జీవితం, మానసిక ఒత్తిడు లతో క్షణికావేశంలోనే కోపతాపాలకు గరవుతున్నారు. పచ్చని కాపురంలో చిన్న చిన్న మనస్పర్థలతోనే పట్టుదలకు పోయి కాపురాలు కూల్చుకుంటున్నారు ఇలా వచ్చిన ఫిర్యాదులు 90 శాతం కౌన్సెలింగ్ ద్వారానే తిరిగి కాపురాలు నిలబెట్టుకుంటున్నారు. మహిళలను హింస పెట్టిన వారికి ఖచ్చితంగా శిక్షపడే విధంగా ప్రత్యేక మానిటరింగ్ సెల్ విధానంలో పనిచేస్తూ సాక్ష్యులను సకాలంలో కోర్టుకు హాజరు పరుస్తున్నాం. ఇప్పటికి ఈ ఏడాది 13 కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడ్డాయి. మహిళలు హింసకు గురైతే 112 కాని 95503 51100 నంబర్‌కు వాట్సప్ మెస్సేజ్ పెడితే పది నిముషాల్లోనే అభయ మహిళా రక్షక దళం వస్తుంది. ధైర్యంగా ఫిర్యాదు చేయండి.

- ఎం.సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్, ఏలూరు

ప్రత్యేక చట్టాలు రావాలి



ఇటీవల కాలంలో మహిళలు, బాలికలు, విద్యార్థులపై దాడులు ఎక్కువగా జరుగుతు న్నాయి. వాటిని అరిక ట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి కఠినమైన శిక్షలు అమలయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకో వాలి. అప్పుడే దాడులు, హింసలను కొంత వరకు అరికట్టవచ్చు. ప్రభుత్వాలు దాడు లను అరికట్టేందుకు ఎన్నో రకాల చట్టాలు తీసుకువచ్చినా కొందరు మృగాల్లో ఎటువంటి మార్పులు రావడం లేదు.

-కళ్యాణి, ఐద్వా జిల్లా మాజీ కార్యదర్శి

తల్లితండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



పిల్లలు భవిష్యత్ కోసం తల్లితండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుం టారు.అలాగే వారి జీవి తాలు ఎంతో అనం దంగా ఉండాలని మంచి ఉద్యోగాలు సంపాదించి ఎంతో ఎత్తుకు ఎదగాలని చూస్తారు. కాని కొందరు మాత్రం అడ్డదార్లు తొక్కుతున్నారు. చదు వుకునే వయసులోనే ప్రేమ అనే వ్యామో హంతో అవతలివారి ఇష్టాలు లేకుండానే వారి వెంటపడి చివరకు వారు తిరస్కరించే సరికి దాడులకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. దీనిపై తల్లితం డ్రులు చిన్నప్పటి నుంచి వారిపై దృష్టి పెట్టాలి.

- రంగారావు , ఇండియన్ అసోసియే షన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

శిక్షలు కఠినంగా ఉండాలి



మహిళలపై దాడులు, హింసలు నిరో ధించేందుకు ప్రత్యేక చట్టాలు ప్రభుత్వాలు తీసుకువచ్చినా కొందరు ఇలాంటి దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. ఇంకా కఠినమైన శిక్షలు పడే విధంగా చట్టాలు రావాలి. చిన్నారులు, బాలికలు, మహిళలపై పేట్రేగి పోవడానికి కారణం...వారిలోని రాక్షసత్వం. ఆ రాక్షసత్వాన్ని అణిచివేసినప్పుడే దాడు లను అరికట్టవచ్చు.

- వై.న్యూటన్, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

లేసు అల్లికలో మరో మైలు రాయి



లేసు అల్లుతున్న మహిళలు

పరిశ్రమకు అంతర్జాతీయ గుర్తింపు
నేడు ఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): జిల్లా లేసు పరిశ్రమ ఈ ఏడాది మరో మైలు రాయిని తాకింది. నరసాపురం మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన జెజె లక్ష్మి అండ్ కంపెనీ ఈ ఏడాది పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌కు లేసు వస్తువుల్ని ఎగుమతి చేసి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. తాజాగా జిల్లాలో తయారు చేస్తున్న లేసు ఉత్పత్తులకు అంతర్జాతీయంగా భౌగోళిక (జియోగ్రాఫికల్) గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా హస్తకళలకు సంబంధించి ఎనిమిది పరిశ్రమలను కేంద్ర జౌళిశాఖ ఎంపిక చేస్తే వాటిలో నరసాపురం లేసు ఉత్పత్తులు కూడా ఉండటం గమనార్హం. దీన్ని పురస్కరించు కుని సోమవారం ఢిల్లీలో జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్‌షాపుకు జిల్లా కలెక్టర్ నాగరాణి హాజరై అవార్డును అందుకోనున్నారు. ఇదే సమయంలో లేసు ఉత్పత్తులకు సంబంధిం చిన స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

జిల్లాలో లేసు పరిశ్రమకు డచ్ వారి కాలంలోనే నాంది పడింది. వ్యాపార నిమిత్తం దేశానికి వచ్చిన డచ్ వారు ఇక్కడ మహిళలకు లేసు అల్లికలపై శిక్షణ ఇచ్చారు. అలా తయారు చేసిన వస్తువుల్ని వారు అక్కడ దేశాలకు ఎగుమతి చేసి అమ్మేవారు. స్వాతంత్రం తరువాత ఈ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందింది. మొదట్లో ఢిల్లీ, ముంబయి వంటి నగరాలకే పరిమితమైంది. అయితే కొందరు విద్యావంతులైన వ్యాపారులు విదేశీ మార్కెట్లపై కూడా దృష్టి పెట్టి అమెరికా, యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తూ వచ్చారు. ఇలా చిన్నగా ప్రారంభమైన ఈ పరిశ్రమ ఒకనొక దశలో రూ.350 కోట్ల మార్కెట్‌కు చేరింది. అత్యధికంగా లేసు ఎగుమతి సంస్థలన్నీ నరసాపురం మండలం సీతారాంపురంలోనే ఉన్నాయి.ఈ గ్రామానికి చెందిన చాలామంది వ్యాపారులు లేసు ఎగుమతుల్లో రాష్ట్రపతి, కేంద్ర మంత్రుల చేతుల మీదుగా అవార్డులు కూడా అందు కున్నారు. తరువాత పాలకొల్లు, ఆచంట ప్రాం తాల్లో కూడా కొన్ని పరిశ్రమలు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా సీతారాంపురం లేసు ఎగు మతుల్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ గ్రామంలో 2000లో లేసు పార్కు ఏర్పాటు చేసింది. ఇక్కడ మహిళలకు శిక్షణ, మార్కెటింగ్, డిజైన్లపై శిక్షణ ఇస్తారు. ఈ లేసుపార్కు పరిధిలో జిల్లాలోని ఆరు మండలాలు, కోనసీమ జిల్లాలో మూడు మండలాలు విస్తరించాయి. మొత్తం ఈ పార్కు పరిధిలో 50 వేల మంది సభ్యులు ఉన్నారు.

మళ్లీ పరిశ్రమకు పూర్వవైభవం

లేసు ఉత్పత్తుల్లో చైనా దూసుకుపోతుంది. అత్యధికంగా మిషనరీ మేడ్ అల్లికల్ని తయారు చేయడంతో తక్కువ మొత్తానికే విదేశీ మార్కెట్‌ల్లో అమ్మకాలు జరుపుతుంది. ఈ కారణంగా గడిచిన పదేళ్ల నుంచి లేసు పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఎగుమతులు కూడా తగ్గాయి. ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో చాలా పరిశ్రమలు మూతపడ్డాయి. ఇలాంటి తరుణంలో లేసు పరిశ్రమకు అంతర్జాతీయంగా భౌగోళికంగా గుర్తింపు రావడంతో లేసు పరిశ్రమకు ఊపిరి పోసినట్టైయింది. కేంద్రం మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించి ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, ఆర్డర్లు అందిస్తే మళ్లీ ఈ పరిశ్రమకు పూర్వవైభవం వస్తుందన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

చాలా సంతోషంగా ఉంది



లేసు పరిశ్రమకు అంతర్జాతీయంగా జియో గ్రాఫికల్ గుర్తింపు రావడం చాల సంతోషం. దేశ వ్యాప్తంగా హస్తకళలకు సంబంధించి ఎనిమిది పరిశ్రమలను ఎంపిక చేస్తే వాటిలో నరసాపురం లేసు పరిశ్రమ కూడా ఉండటంతో మళ్లీ ఈ రంగానికి పూర్వ వైభవం వచ్చినట్టైయింది. ప్రభు త్వాలు ప్రోత్సాహకం అందిస్తే మళ్లీ పరిశ్రమకు మంచి రోజులు వస్తాయి. వేలాది మంది ప్రత్యేకంగా పరోక్షంగా ఉపాధి పొందుతారు.

-కలవకొలను తాతాజీ, లేసు ఎక్స్‌పోర్టర్



బాస్కెట్ బాల్ పశ్చిమ జట్టు ఎంపిక

పెనుమంట్ర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మార్టేరు వైటీఏ ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే కప్ వచ్చే నెల 6,7,8,9 తేదీల్లో బాస్కెట్బాల్ పోటీలకు సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు వైటీఏ అధ్యక్షుడు చర్ల బాలాజీ రెడ్డి తెలిపారు. కెప్టెన్‌గా కుమార్ వర్మ, బాస్కె ట్బాల్ ప్లేయర్స్‌గా ముని సందీప్, ఏ సాయిరాం, ఎస్.కె అమిద్ అలీషా, కేబిఎస్ అన్నవరం రెడ్డి, ఎస్‌టికే రెడ్డి, ఎం.శివ, కే.మణికంఠ, సత్య కిరణ్, ఆశిష్ రాజ్, కే.కుమార్, రవితేజరెడ్డి కే.లోకేష్, విజయ శంకర్, కెమణి కంఠ గోపాల్‌రెడ్డి, కెడానీ జోసఫ్, సూర్యకిరణ్ ఎంపికయ్యారు.

చిన వెంకన్న దర్శనం కోసం వచ్చి అనంతలోకాలకు ..



ద్వారకాతిరుమల, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు జిల్లా ద్వార కాతిరుమల చిన వెంకన్న దర్శనార్థం వచ్చిన ఓ అయ్యప్ప మాల ధారుడు స్వామిని దర్శించకుండానే గుండె పోటుకు గురై మృతి చెందాడు. అమలాపురం మండలం ఇందుపల్లికి చెందిన సురేష్ అయ్యప్ప మాలను ధరించి తన మిత్రులతో కలసి పుణ్య క్షేత్రాలను దర్శించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8.50 గంటలకు ద్వారకాతిరుమలకు చేరుకున్న వారు 9 గంటల కల్లా ఆలయం మూసి వేస్తారని తెలుసుకుని జంట గోపురాల వద్ద వాహనం ఉంచి అక్కడ నుంచి ఆలయానికి పరు గులు తీశారు. అయితే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలాడు. స్నేహితులు అతనికి ఫస్ట్ ఎయిడ్ చేసి త్వరగా పీహెచ్‌సికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్య సిబ్బంది చెప్పారు.

విద్యార్థినిపై చేయి చేసుకున్న కరస్పాండెంట్

కేసు నమోదు చేసిన పోలీసులు

ఆకివీడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినిపై స్కూల్ కరస్పాండెంట్ చేయి చేసుకోవడంతో బాలిక ఆకివీడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు..మండలంలోని నందమిల్లిపాడుకు చెందిన దారబోయిన అమృత తల్లిదం డ్రులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అమ్మమ్మ, తాతయ్యల దగ్గర ఉంటూ స్థానిక విజ్ఞాన ఇంగ్లీషు మీడియం హైస్కూ ల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. రోజూ స్కూల్ బస్సులో వచ్చి వెళుతుంది. ఈనెల 22న స్కూల్ వదిలిన తరువాత బస్సులో ఇంటికి వెళుతుండగా కరస్పాండెం ట్‌పై విద్యార్థులు సెటైర్లు వేసుకున్నారు. ఈ విషయాన్ని డ్రైవర్ కరస్పాండెంట్‌కు చెప్ప డంతో కరస్పాండెంట్ సత్యనారాయణ మూర్తి ఆగ్రహానికి గురై తరగతి గదికి వెళ్ళి విద్యార్థుల అందరి ముందు అమృత చెంపలు వాయించాడు. తన గదిలోకి తీసు కెళ్లి పీక నులిమి చంపేస్తానని బెదిరిం చారు. జరిగిన విషయం అమ్మమ్మకు చెప్పడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆదివారం ఎంఈవో రవీంద్ర విచారణకు స్కూల్‌కు వెళ్ళగా కర స్పాండెంట్ లేరు. అక్కడ నుంచి స్టేషన్‌కు వెళ్లారు. ఎస్‌ఐ హనుమంతు నాగరాజు అమృత, కుటుంబ సభ్యులను పిలిపించి విచారించారు. బాలిక తాతయ్యతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. విద్యార్థి ఇచ్చిన ఫిర్యాద మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. సోమవారం డ్రైవర్, విద్యార్థులను విచారించి నివేదిక డీఈవోకు అందజేస్తానని ఎంఈవో చెప్పారు.

క్రైమ్ కార్నర్

కుక్క అడ్డురావడంతో... బైక్‌పై నుంచి పడి రెవెన్యూ ఉద్యోగి మృతి

దెందులూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కుక్క అడ్డురావడంతో మోటార్ సైకిల్‌పై నుంచి పడి రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ నడిపల్లి శ్రీనివాస్ (60) మృతి చెందారు. ఆదివారం రాత్రి ఏలూరు- జంగారెడ్డిగూడెం రోడ్డులో మోటార్ సైకిల్‌పై ఆశ్రం వైపు నుంచి సోమవరప్పాడు అండర్ పాస్ సమీపంలో వెళ్తుండగా రోడ్డు మీద కుక్క అడ్డుగా రావడంతో మోటార్ సైకిల్ అదుపు తప్పి బైక్ పడిపోయింది. ఈ ప్రమాదంలో దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో సీని యర్ అసిస్టెంట్‌గా పనిచేసున్న శ్రీనివాస్ అక్కడి కక్కడే మృతి చెందాడు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు

రైలు నుంచి జారిపడి యువకుని మృతి

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు బిహార్‌కు చెందిన యువకుడు జారి కిందపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన అజయ్‌రామ్ (29) రైలులో ప్రయాణిస్తూ ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వే గేటు సమీపంలో ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. ఈ సమాచారం ఎస్‌ఐ సైమన్‌కు అందడంతో ఆదివారం సాయంత్రం వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అను మానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని వద్ద లభించిన ఆధారాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వృద్ధురాలు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఏలూరు తంగెళ్ళ మూడి ప్రాంతం ఎంఆర్‌సీ కాలనీకి చెందిన బోనెల పాపాయమ్మ (74) ఈనెల 16వ తేదీ ఉదయం జెఎంజె స్కూలు వద్ద రోడ్డుపై నడిచి వెళ్తుండగా ఒక మోటారు సైకిలిస్టు ఢీ కొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య



ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలోని ఆశ్రం మెడి కల్ కాలుజీలో పోస్టుగ్రాడ్యు యేషన్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నర్సరావు పేటకు చెందిన వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఆసుపత్రి అత్యవసర విభాగంలో డ్యూటీ చేయడానికి వచ్చారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు గడియ పెట్టుకుని ఎంత సేపటికి రాలేదు. ఉదయం 8.15 గంటలకు మిగిలిన డాక్టర్లు వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. దీంతో ఆసుపత్రి సీఈవో డాక్టర్ హనుమంతరావు ఇతర అధికారులకు తెలియజేసి వెంటనే తలుపులను పగులగొట్టి చూశారు. డాక్టర్ జవహర్ మరణించి ఉన్నారు. అక్కడ మత్తు ఇంజక్షన్లు, సిరంజ్‌లు లభించాయి. పోలీ సులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీ లించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

జవహర్ తండ్రి డాక్టర్ విజయ్ సాగర్ నర్సరావుపేటలో పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. జవ హర్ తన తల్లిదండ్రులకు ఒకే ఒక్క సంతానం. జవహర్ మత్తు వైద్యుడిగా చదు వుతూ మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మెడికల్ కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. ఏలూరు రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తు న్నారు. ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో పోస్టు మార్టం జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆస్తికోసమే చంపేశాడు

పిన్ని, తమ్ముడిని హత్యచేసిన హంతకుడు అరెస్టు



వివరాలు చెప్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్



హత్యలకు ఉపయోగించిన కత్తి, చాకు

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 40 సెంట్ల వ్యవసాయ భూమి, నాలుగు సెంట్ల ఇంటి స్థలం... వీటి మార్కెట్ విలువ సుమారు 25 లక్షలు ఉండవచ్చు.. ఈ ఆస్తి కోసం పిన్ని, తమ్ముడిని దారుణంగా హతమార్చాడు..ఆ కిరాత కుడు.. జంట హత్యలు జరిగిన 24 గంటల్లోనే పోలీసులు హంతకుడిని అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆదివారం విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన రొయ్యూరు సుబ్బారావుకు భార్య నాంచారమ్మ ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు జరిగాయి. సుబ్బా రావు నాంచారమ్మ సోదరి అయిన భ్రమ రాంభను రెండో భార్యగా పెళ్ళి చేసుకున్నాడు. భ్రమరాంభకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి కూడా వివాహాలు అయ్యాయి. సుబ్బారావు మతి స్థిమితం లేక ఎటో వెళ్ళిపోయాడు. నాంచా రమ్మ కూడా లేదు. సుబ్బారావు తండ్రి నాగ లింగం పేరుమీద ఉన్న 40 సెంట్ల పొలం, 192 గజాల ఇంటి స్థలం విషయంపై తరచుగా నాంచారమ్మ కుమారుడైన నగేష్‌బాబు (50)కి అతని పిన్ని అయిన భ్రమరాంభ, తమ్ముడైన సురేష్‌కు గొడవలు జరుగుతున్నాయి. పెద్దల ద్వారా పరిష్కారం చేసుకునే ప్రయత్నించగా ఉన్న ఆస్తిని ఇద్దరు చెరో సగం పంచుకోవాలని సూచించారు. దీనికి నగేష్‌బాబు అంగీకరించ లేదు. కొన్నేళ్ళ క్రితమే నగేష్‌బాబు ఊరువిడిచి విజయవాడ వెళ్ళి ఒక లారీ కొనుగోలు చేసుకుని మోటారు ఫీల్డ్‌లో ఆర్థికంగా స్థిరపడ్డాడు. అతని కుమారుడు, కుమార్తెకు కూడా వివాహాలు జరి పాడు. అయితే తాత తనకే చెందుతుందని ఒక్క అంగుళం కూడా ఇవ్వనని పెద్దల ముందు చెప్పాడు. ఈనెల 21వ తేదీన సురేష్ భార్య గాయిత్రి తన ఇద్దరు పిల్లలను తీసుకుని తన తండ్రి సంవత్సరీక కార్యక్రమానికి వెళ్ళింది. సురేష్ కూడా ఈనెల 22వ తేదీన ఆ కార్యక్ర మానికి తిరిగి ఇంటి వచ్చాడు. ముందు హత్య చేయాలని ప్లాన్ చేసుకున్న నగేష్‌బాబు 22వ తేదీ రాత్రి వచ్చి సాయిబాబా గుడి వద్ద ఉన్నాడు. అర్ధరాత్రి వేళ భ్రమరాంభ ఇంటికి వెళ్ళి తలుపులు కొట్టాడు. వారు బయటకు రాగానే హత్య చేయాలని మాటు వేసుకుని అక్కడే ఉన్నాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చిన భ్రమరాంబపై దాడి చేసి కత్తితో మెడపై నరి కేశాడు. ఆమె అక్కడే మరణించింది. ఇంట్లోకి వెళ్ళి గాఢ నిద్రలో ఉన్న సురేష్‌ను కూడా చాకుతో పొడిచి హతమార్చాడు. అక్కడ నుంచి వెళ్ళి సాయిబాబ గుడి సమీపంలో కత్తి, చాకును ఒక ప్లాస్టిక్ పైపులో దాచి వెళ్ళిపోయాడు. ఈ నెల 23వ తేదీ ఈ సంఘటన వెలుగులోకి రావడంతో జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ రవి కుమార్, మండవల్లి ఎస్‌ఐ రామచంద్రరావు, కానిస్టేబుళ్ళు దర్యాప్తు చేప ట్టారు. ఆదివారం మధ్యాహ్నం దాచిన కత్తు లను తీసుకు వెళ్ళడానికి వచ్చిన నగేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహ రించిన సీఐ రవికుమార్, ఎస్‌ఐ రామచంద్రరావు, కాని స్టేబుళ్ళు నాగాం జనేయులు, నాగార్జునులకు ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను డీఎస్పీ అందించారు.

లాభాల కిక్ రివర్స్

(5వ పేజీ తరువాయి)

మద్యం ఉండేది. బార్‌లకు బ్రాండ్‌లు సరఫరా అయ్యేవి. క్వార్టర్ బాటిల్‌పై రూ.40 అధికంగా విక్రయించేవారు. ఎంఆర్‌పి ధరకే బార్‌లకు మద్యాన్ని సరఫరా చేస్తారు. ఆ పైన ధర వేసుకుని విక్రయించే వెసులుబాటు బార్‌లకు ఉంది. బ్రాండెడ్ రకాలు బార్‌లలో లభ్యం కావడంతో వ్యాపారాలు జోరుగా సాగాయి. మంచి లాభాలు వచ్చాయి. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం ప్రైవేటు మద్యం షాపుల్లో దొరుకుతోంది. దీంతో బార్‌లో అమ్మకాలు సగానికి పడిపోయాయి. ధరలు తగ్గించాల్సి వచ్చింది. ఫలితంగా నష్టాలు చవిచూస్తున్నా మంటూ బార్ యజమానులు గగ్గోలు పడుతున్నారు. మొత్తంగా ప్రైవేటు మద్యంతో మద్యపాన ప్రియులకు ఊరట లభించింది. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెడుతోంది. కానీ వ్యాపారానికి లాభం రావడం లేదంటూ లైసెన్స్‌దారులు ఘొల్లుమంటున్నారు.



ఉండిలో పుస్తకాన్ని ఆవిష్కరించిన మంతెన రామరాజు, తదితరులు

'అమ్మానాన్న' పుస్తకం ఆవిష్కరణ

ఉండి, నవంబరు 24: అమ్మానాన్న పుస్తకం కుటుంబం వ్యవస్థను తెలుపుతుందని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. ఆదివారం ఉండి రాజులపేటలో కూనప రాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో వేద విజ్ఞాన పరిషత్ చైర్మన్ డీవీ బాలసుబ్రహ్మణ్యం రచించిన అమ్మానాన్న కథ సంపుటిని ఆయన ఆవిష్కరించారు. సభకు జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్‌వీఎస్‌రాజు అధ్యక్షత వహించారు. ఎంపీపీ ఇందుకూరి హరినారాయణరాజు, పేరి కామేశ్వరరావు, పార్వతీ శర్మ, కె.ఎస్‌రావు విజ్ఞాన వేదిక కేఎస్‌రావు విజ్ఞాన వేదిక చెరుకువాడ రంగసాయి, డాక్టర్ గాదిరాజు రంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గోపీమూర్తిని గెలిపించాలి

కాళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం ఈ మేరకు కాళ్లలో యూటీఎఫ్ కాళ్ల మండలశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని సుమారు 42 మంది ఓటర్లను కలిసి ఓటును అభ్యర్థించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, మండల అధ్యక్షుడు బీఆర్ఎంకే స్వామి, ప్రధాన కార్యదర్శి ఎం. శంకరరావు, పి. ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య ప్రయోజనాలు

భీమవరంటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యోగాతో ఆరోగ్య ప్రయోజనాలు అనేకమని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో సకారాత్మ ఫౌండేషన్ సంకలం సమాధి యోగ ఆధ్యాత్మిక ఆరోగ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత యోగ ధ్యాన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ప్రేమ్ నిరంతర గురూజీ డాక్టర్ నాన్న మాట్లాడుతూ ఒత్తిడిని జయించాలంటే యోగాను దిన చర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, అల్లూరి వెంకట రాఘవ రాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పీవీ ఎస్ఎస్ఎన్ రాజు, వబిలిశెట్టి వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం జడ్పీ పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం పాఠశాల అభివృద్ధికి 1983-84 సంవత్సరానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అభివృద్ధి కమిటీ నిర్వాహకుడు ఎన్‌వీ సత్యనారాయణకు రూ.63 వేలు ఐరెన్ నిమిత్తం అందించారు. ఈ సందర్భంగా ఆయన పూర్వ విద్యార్థులను అభినందించారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

తణుకు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఆదివారం వైద్య సేవలు అందించారు. నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించి అక్కిన కాశీవిశ్వనాథం ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి వర్మకు పితాని పరామర్శ

భీమవరంటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తండ్రి సూర్యనారాయణ రాజు మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరామర్శించారు. తొలుత సూర్యనారాయణ చిత్ర పటం వద్ద పూలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారిన తాతాజీ, వేంద్ర వెంకటస్వామి తదితరులు ఉన్నారు.





ఎమ్మెల్యే అంజిబాబును సత్కరించిన కాపు సంఘ నాయకులు.. ఎమ్మెల్యేను అభినందిస్తున్న గాదిరాజు బాబు

పీఏసీ చైర్మన్ అంజిబాబుకు ఘన సత్కారం

భీమవరంటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :సౌమ్యులు, స్నేహశీలి, ప్రజాసేవకు పరితపించే మనస్తత్వం గలవారు ఎమ్మెల్యే అంజిబాబు అని, అటువంటి వ్యక్తికి రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా నియమించడం శుభ పరిణామమని జాతీయ కాపు సంఘం నాయకులు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు యర్రంశెట్టి శివకృష్ణ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అంజిబాబును సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కేబినెట్ హోదా కలిగిన పదవి రావడం ఆనందదాయకమన్నారు. జాతీయ కాపు సంఘం సెంట్రల్ ఉపాధ్యక్షుడు జడ్డు శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపోలు అంజనేయులు, యర్రంశెట్టి నాగసాయి, యర్రంశెట్టి బ్రహ్మాజీ, యర్రంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎస్ నాయుడు, నల్లం అన్నపూర్ణ, వర్ధినీడి వెంకటలక్ష్మి, గంధం చిన్నా పాల్గొన్నారు.

గాదిరాజు బాబు అభినందనలు

రాష్ట్ర పీఏసీ చైర్మన్‌గా నియమితులైన పులపర్తి రామాంజనేయులును మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాదిరాజు సత్యనారాయణరాజు అభినందించారు. ఆయన మాట్లాడుతూ అంజిబాబు మంచి రాజనీతిజ్ఞుడు అన్నారు ఈ మేరకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మల్లినీడి అభినందనలు

అపర చాణక్యుడు ఎమ్మెల్యే అంజిబాబు అని జనసేన రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అంజిబాబును కలిసి అభినందనలు తెలిపారు. నాయకులు పిల్లా నారాయణమూర్తి, చిరంజీవి ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, యాన అనిల్, కొప్పినీడి బాబి, మాదాసు సాయి, యాడ్లపల్లి రాంబాబు పాల్గొన్నారు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం : ఆరిమిల్లి

తణుకు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో 19 మందికి 21 లక్షల 18 వేల 507 రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. గత జూలైలో కురిసిన వర్షాలకు తణుకు మున్సిపల్ కార్మికుడు ఎల్లారి శ్రీనివాసరావు విద్యుదాఘాతంతో చనిపోవడంతో హామీ మేరకు రూ.రెండు లక్షల చెక్కును మృతుడి భార్యకు అందజేశారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి

పెనుమంట్ర/ఉండి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక నేరగాడు అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఆదివారం పెనుమంట్ర మండల మహాసభ సందర్భంగా పొలమూరు గ్రామంలో సీపీఎం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ దేశాన్ని అప్రతిష్ట పాలు చేసే విధంగా అదానీ కుంభకోణాలు ఉన్నాయని, సిట్టింగ్ జడ్జితో విచారించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కె.ప్రసాద్, ఆకుల హరేమం, రాపాక ఆశీర్వాదం . కె సుబ్బరాజు నేతల నాగేశ్వ రరావు సీహెచ్ లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం నాయకుల నిరసన

● ఉండిలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అదానీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి చీర్ల శేషు, ధనికొండ శ్రీను, కింతాడ రమేష్, నిమ్మితి కిశోర్, మాధవరావు, రామకూరి వెంకటరత్నం, కిలారి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'బహుముఖ ప్రజ్ఞాశాలి పట్టాభి సీతారామయ్య'

భీమవరం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య అని, ఆర్థిక వ్యవస్థలపై నిర్దిష్టంగా ఉంటూ బ్యాంక్‌లను స్థాపించడం విశేషమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ అన్నారు. ఆదివారం క్విట్ ఇండియా స్తూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సీతారామయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూటన్ మాట్లాడుతూ ఆంధ్రా బ్యాంకును 1923లో మచిలీపట్నంలో స్థాపించారన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆంధ్రాబ్యాంక్ 1980లో జాతీయం చేశారని, దేశానికి క్రెడిట్ కార్డు వ్యవస్థను ఈ బ్యాంకు పరిచయం చేసిందని, ఈ బ్యాంక్ 22 రాష్ట్రాలలో రెండు కేంద్ర పాలిత ప్రాంతాలలో విస్తరించి ఉందని, పెట్టుబడులను రాబట్టడంలో ఈ బ్యాంకు ఆసియాలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, కలిగోట్ల గోపాలశర్మ, ఎస్కే చాన్ బాషా, ఇందుకూరి ప్రసాద్‌రాజు, పి.అమూల్యరావు తదితరులు పాల్గొన్నారు.



పట్టాభి సీతారామయ్య చిత్రపటం వద్ద నివాళులు

వేగవంతంగా అబ్దుల్ కలాం పార్కు పనులు

పాలకొల్లు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేందుకు, వ్యాయామం, వాకింగ్ ట్రాక్ వంటి వాటితో నిర్మిస్తున్న డాక్టర్ అబ్దుల్ కలాం శంభుని పార్కు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ చెరువు ఉండేది. చెరువులో నీటిని ఫైర్ సర్వీస్ శాఖ వారు వినియోగించుకునే వారు. ఈ నేపథ్యంలో 2014-19ల్లో ఎమ్మెల్యేగా ఉన డాక్టర్ నిమ్మల రామానాయుడు చొరవతో ఈ చెరువును అభివృద్ధి చేయాలని సంకల్పంతో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులు నిలిపి వేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. జూన్‌లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నిమ్మల పనులను పునఃప్రారంభం చేయించారు. ప్రస్తుతం పార్కు ఆర్చి పనులు, వాకింగ్ ట్రాక్ పనులు వేగంగా జరుగుతున్నాయి.



అబ్దుల్ కలాం పార్కులో ఆర్చి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం



డీఎన్నార్ క్రీడా మైదానంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న గోకరాజు వెంకటనరసింహరాజు

ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ వేడుకలు

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ గత ఏడున్నర దశాబ్దాలుగా భారత దేశ యువతకు ముఖ్యంగా విద్యార్థులకు మార్గదర్శకత్వం వహిస్తూ ఎంతోమంది జీవితాలకు బంగారు బాటలు వేసిందని డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు అన్నారు. డీఎన్నార్ కళాశాలలో ఆదివారం క్రీడా మైదానంలో డీఎన్నార్ కళాశాల సీనియర్ డివిజన్ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో 76వ ఎన్‌సీసీ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. తొలుత వేడుకల పరేడ్‌ను సమీక్షించి, ఎన్‌సీసీ కేడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఎంతోమందిని క్రమశిక్షణ మొదలగు అంశాలలో తగు శిక్షణ ఇచ్చి దేశవ్యాప్తంగా విశిష్ట సేవలందిస్తుందన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణకు మారుపేరన్నారు. వేడుకలకు విచ్చేసిన పాలకవర్గ సంయుక్త కార్యదర్శి కెరామకృష్ణంరాజు మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా నేర్చుకున్న ప్రతీ దానిని జీవితంలో పాటిస్తే, ప్రతీ విద్యార్థి ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. అనంతరం కేడెట్లు జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కేడెట్లకు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎ.వీరయ్య, పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. పాలకవర్గ ఉపాధ్యక్షుడు సీహెచ్ బోస్ రాజు, కేడెట్లు తదితరులు పాల్గొన్నారు.



యూత్ హాస్టల్స్ నూతన కార్యవర్గ సభ్యులు

యూత్ హాస్టల్స్ నూతన కార్యవర్గ ఎన్నిక

పాలకొల్లు అర్బన్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు యూత్ హాస్టల్స్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం లయన్స్ క్లబ్ భవనంలో జరిగింది. అధ్యక్షుడిగా పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ, డి.వెంకట్రావు, చైర్మన్‌గా కారుమూరి సూర్యనారాయణ, కోశాధికారిగా ఎస్. సుబ్బారావు, కార్యదర్శిగా వీవీఎస్ఎస్ ప్రసాద్, వీవీఆర్ లక్ష్మీశిరీష, ఏకే కుమార్, ఎం.పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.రామలింగేశ్వరరావు, పరిశీలకులుగా రాష్ట్ర కమిటీ నుంచి బి.ఉమామహేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారులుగా కేవీఆర్.నరసింహారావు, బీహెచ్ అచ్యుత రామరాజు వ్యవహరించారు. మరో 11 మంది కార్యవర్గ సభ్యులుగా సమావేశంలో ఎన్నుకున్నారు.



సాహితీవేత్త శ్రీనివాసరావును సత్కరిస్తున్న రసధుని సంస్థ కార్యవర్గ సభ్యులు

కందుకూరి వీరేశలింగం సంస్కరణలు మరువలేనివి

పాలకొల్లు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు చేపట్టిన సంస్కరణలు మరువలేనివని ప్రముఖ సాహితీవేత్త కానుకొలను శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సరస్వతి శిశుమందిరం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సాహిత్య గోష్టిలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞాన అంధకారం, మూఢనమ్మకాలు అధికంగా ఉన్న ఆనాటి రోజుల్లో ఎంతోమందిని వీరేశలింగం చైతన్య పరిచారన్నారు. ఈ సందర్భంగా వక్త శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి యర్రంశెట్టి వెంటకరత్నం, పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, ముద్దాల వాసు ఉన్నమట్ల కపర్ది, డి.గోపాలకృష్ణ, కేసీహెచ్ పెద్దిరాజు, చేగొండి రంగారావు, కొల్లి నరసింహ మూర్తి, వంగా నరసింహారావు, శేషాద్రి, కె.నరసింహరాజు, చుండూరి రంగయ్య నాయుడు, కొట్టి రామం శిశు మందిరం ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ కాపు ప్రధాన కార్యదర్శిగా 'కూనపరెడ్డి'

పెనుగొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెనుగొండకు చెందిన కూనపరెడ్డి సుధాకర్ రాజును జాతీయ కాపు సంఘం ఆచంట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా జాతీయ అధ్యక్షుడు కర్ర మురళీకృష్ణ నాయుడు నియమించినట్లు తెలిపారు. మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో సుధాకర్‌రాజు నియామక పత్రం అందుకున్నట్లు తెలిపారు. ఆయనను పలువురు అభినందనలు తెలిపారు.

ఎంఈవో శేషు సేవలు అభినందనీయం

గణపవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన పదవీకాలంలో విద్యాభివృద్ధికి అంకితభావంతో పని చేసిన ఏ అధికారి అయినా గుర్తుండిపోతారని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గణపవరం, నిడమర్రు మండలాల ఎంఈవోగా పనిచేస్తున్న పుచ్చల శేషు పదవీ విరమణ సందర్భంగా ఆదివారం సరిపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో వీడ్కోలు సభ వైభవంగా జరిగింది. గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల నుంచి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొని శేషుని అభినందించారు.

300 మందికి నేత్ర పరీక్షలు

పాలకోడేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి వైద్యం అందించి, మందులు అందజేయడం అభినందనీయమని కుముదవల్లి సర్పంచ్ భూపతి రాజు వంశీకృష్ణంరాజు అన్నారు. కుముదవల్లి పంచాయతీ కార్యాలయం వద్ద భీమవరం ఐడియల్ విజన్‌సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ పెనుమత్స సూర్యసౌమిత్ ఆధ్వర్యంలో సుమారు 300 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. నాయకులు శ్రీనివాసరాజు, సత్యనారాయణ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

పాలకొల్లు రూరల్ : గోరింటాడ ఎంపీపీ స్కూల్లో ఆదివా రం యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎముకల వైద్య నిపుణుడు నారిన హర్ష ప్రారంభించారు. వైద్యులు కార్తీక్, లక్ష్మీప్రసన్న, జక్కంపూ డి.సుభాషిణి, పెనుమాక భార్గవి 200 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు.

వడలి గ్రామంలో వైద్య శిబిరం..

పెనుగొండ : వడలి గ్రామంలోని మందాలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలు వ్యాపించినందున వైద్యశిబిరం నిర్వహించి, మందులు అందజేశామన్నారు.









పాలకొల్లులో మంత్రిని సన్మానిస్తున్న శెట్టిబలిజ కులస్థులు.. కొడమంచిలిలో పితానిని సన్మానిస్తున్న కాపు సంఘం నేతలు.. పెంటపాడు వన సమారాధనలో రెడ్డి కులస్థులు.. ఆకివీడు ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో కార్తీక వనసమారాధన భోజనాలు

ఉత్సాహంగా కార్తీక వన సమారాధనలు

పాలకొల్లు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధనలు ఘనంగా జరిగాయి. పాలకొల్లు మార్కెట్ యార్డులో ఆదివారం జరిగిన నియోజకవర్గస్థాయి శెట్టిబలిజ కార్తీక వనసమారాధనలలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మలను శెట్టిబలిజ నాయకులు గజమాలతో సత్కరించారు. చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కుక్కల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● భీమవరంటౌన్ : గునుపూడిలోని అన్నపూర్ణ పార్వతి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధనను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని కోపా కల్యాణ మండపంలో కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 29వ వార్షికోత్సవ కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఏపీ రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, ఇస్రో శాస్త్రవేత్త డీవీ మహాలక్ష్మి పాల్గొన్నారు. భగవద్గీత పారాయణం చేసిన చిన్నారి బొలిశెట్టి చేతన, దారపురెడ్డి సూర్యచంద్రరావులను సత్కరించారు. నౌకాన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి హర్ష పాల్గొన్నారు. పట్టణంలోని ప్రకృతి ఆశ్రమం సమీపంలో భీమవరం పట్టణ పద్మశాలి అభ్యుదయ సంఘం కార్తీక వన సమారాధనలో ముఖ్యఅతిథిగా కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్ : నరసాపురం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సంఘం అధ్యక్షుడు అత్మూరి వెంకటనరసయ్య, కార్యదర్శి గుడివాడ సాయిరాధాకృష్ణ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి, మాజీ ఎమ్మెల్యే జానకీరామ్, కోటిపల్లి సురేష్‌లను సంఘం తరపున ఘనంగా సత్కరించారు. సీతారాంపురంలో గౌడ, శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు.

● మొగల్తూరు : నవుడూరు గరువు శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో మండల గౌడ, శెట్టిబలిజ 30వ వార్షికోత్సవ కార్తీకవన సమారాధనను ఆదివారం మొగల్తూరులో ఘనంగా నిర్వహించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, నరసాపురం జడ్పీటీసీ గుబ్బల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరులోని గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనను మొగల్తూరులో నిర్వహించారు.

● యలమంచిలి : కాకతీయ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యలమంచిలి వశిష్ఠ గోదావరి తీరాన ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాళ్లూరి శ్రీనివాస్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, తాళ్లూరి సత్యశ్రీనివాస్, బొప్పన రాంబాబు, బొబ్బా రాజేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : పట్టణంలో క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఎల్ఆర్‌పేటలోని పరిషత్ కల్యాణ మండపంలో తెలికుల సంఘం ఆధ్వర్యంలో సాయిబాబా గుడిరోడ్డు తోటలోనూ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణ శివారు అడవిపాలెం తోటల్లోనూ కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఆయా సంఘాల నాయకులు జి గాంధీ భగవాన్‌రాజు, సూర్య నారాయణ రాజు, డిటిడిసి బాబు, పొత్తూరి రంగరాజు, తెలికుల సంఘం మోహనరావు, పెద్దిరాజు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

● ఆకివీడు : ఆకివీడులో ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో, వైఖానస జన జాగృతి సంఘం ఆధ్వరంలో మదనగోపాల స్వామి దేవస్థాన ప్రాంగణంలో కార్తీక వనసమారాధనలు నిర్వహించారు.

● పెంటపాడు: రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలకృష్ణ అధ్యక్షతన పెంటపాడు గ్రామంలో ఆదివారం రెడ్డి సంఘం వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వూరి లక్ష్మణరెడ్డి, నల్లమిల్లి చినగోపిరెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, కేతిరెడ్డి రాంబాబు రెడ్డి, మేడపాటి పల్లారెడ్డి, కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గణపవరం: వల్లూరు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ముచ్చెర్ల వేణుగోపాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పాల్గొని స్వామికి పూజలు చేశారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఆచంట : ఐక్యతకు కార్తీక వన సమారా ధనలు ప్రాధాన్యత ఇస్తాయని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం కాపు సంఘం ఆధ్వర్యంలో కొడమంచిలి, పెనుమంచిలి, ఆచంటలో కార్తీక వనసమారాధనలు జరిగాయి. కొడమంచిలిలో వన సమారాధనలో ఎమ్మెల్యే పితాని పాల్గొన్నారు. కాపు సంఘం ఆధ్వర్యంలో పితానిని ఘనంగా సత్కరించారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : ఉమ్మడి పశ్చిమ గోదావరి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్‌ల కార్తీక వన సమారాధన నిర్వహించారు. జిల్లాలోని ఇంజనీర్‌ల కుటుంబ సభ్యులు ఆటలు, పాటలతో సందడి చేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్‌లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు, సబ్ డివిజనల్ ఇంజనీర్‌లు, అసిస్టెంట్ ఇంజనీర్‌లు పాల్గొన్నారు.

పెనుమంట్ర : రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా రెడ్డి సామాజికవర్గం అభివృద్ధి చెందాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండలం రెడ్డి కల్యాణ మండపంలో రెడ్డి కార్తీక వన సమారాధన నిర్వహించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీల్లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించిన పేద విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేశారు. కోనాల కోదండ చంద్రశేఖర్‌రెడ్డి, తేతలి రాజారెడ్డి, సోమిరెడ్డి, వెలగల మల్లికార్జున్‌రెడ్డి, చిర్ల బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



యలమంచిలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కాకతీయ యువజన సంఘ సభ్యుల నివాళి